క్లుప్తంగా

పెన్షన్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యమకారులు

కొత్తగూడెంఅర్బన్: 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రభుత్వం పెన్షన్, హెల్త్ కార్డు, వంద గజాల ఇంటి స్థలం, రేషన్‌కార్డు, బస్‌పాస్ మంజూరు చేయాలని కలెక్టర్ ప్రియాంకకు గురువారం వినతిపత్రం అందజేశారు. తొలుత కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతిరామ్ మాట్లాడుతూ.. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన వారిని గుర్తించి, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. చింతలచెర్వు గెర్షోము, అనంతరెడ్డి, హరిగోపాల్, కనకయ్య, గౌస్, దూడల బుచ్చయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీలో ఆపిన పోడు పట్టాలను పంపిణీ చేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ ప్రియాంకకు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సోనీ, రమాదేవి

జూలూరుపాడు: కాకర్ల గ్రామంలో గురువారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ బానోత్ రమాదేవితో కలిసి జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ కృషి ఫలితంగా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయి. పొన్నెకంటి సతీష్ కుమార్, చీమలపాటి భిక్షం, నాని బాబు, ముత్తినేని రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాల్లో ముందుండాలి..



మాట్లాడుతున్న హరీష్‌గౌడ్

ఇల్లెందు: దేశ స్వాతంత్య్రం కోసం జరిగిన పోరాటాలలో, తెలంగాణ పోరాటంలో విద్యార్థుల పాత్ర అమోఘమని, రానున్న కాలంలో సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు వి.హరీష్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఇల్లెందులోని విఠల్‌రావు భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ పట్టణ, మండల మహాసభలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పట్ల పోరాటాలలో ఏఐఎస్ఎఫ్‌కు ఒక చరిత్ర ఉందన్నారు. చదువుతూ పోరాడు.. చదువు కోసం పోరాడాలని కోరారు. అనంతరం పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వినయ్, కల్యాణ్, సాయి, సన్నీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు వివేక్ వర్ధన్, గణేష్, రాజేష్, చందూ, నరేష్, గోపీచంద్, దుర్గాప్రసాద్, రవితేజ్, వేణు, వివేక్, విష్ణులను ఎంపిక చేశారు.

డ్రెయినేజీ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయండి



డ్రెయినేజీలో నిల్వ ఉన్న నీరు

పాల్వంచరూరల్: డ్రెయినేజీ కోసం కాలువ తీసి నిర్మాణంలో జాప్యం చేయడంతో కాలువలో వరద నీరు చేరి దోమలు, ఈగలు అధికమవుతున్నాయని రంగాపురం గ్రామస్తులు వాపోతున్నారు. వారం రోజుల క్రితం కాలువ తవ్వి వదిలివేయడంతో నీరు నిల్వ ఉంటున్నాయని, దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నామని అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు సర్పంచ్ హరిని వివరణ కోరగా.. గ్రామంలో రూ.9 లక్షల వ్యయంతో మూడు డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టాం. కాలువ తీసిన తరువాత వర్షాలు కురవడంతో పనులు నిలిచిపోయాయి త్వరలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

అండర్ బ్రిడ్జి.. అవస్థలు

- నాలుగు మార్గాల్లో తప్పని ఇబ్బందులు
- వర్షాకాలంలో నిలిచిపోతున్న రాకపోకలు
- ఎవరూ పట్టించుకోని వైనం



కోయగూడెం, సర్వారం గ్రామాల మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వరద (ఫైల్)

సుజాతనగర్: రైల్వేశాఖ తన ప్రయోజనాల కోసం ప్రజల సౌకర్యాలను దెబ్బతీస్తోంది. బొగ్గు రవాణా కోసం ఏర్పాటు చేసిన రైలుమార్గంలో రైలు నడుస్తుండగా.. అండర్ బ్రిడ్జిల వద్ద మాత్రం మోకాళ్ల లోతు నీరు నిలవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భద్రాచలం, సత్తుపల్లి రైల్వే నిర్మాణంలో భాగంగా సర్వారం, కోయగూడెం, సర్వారం, నరసింహాసాగర్, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు కొత్తగూడెం నుంచి హైదరాబాద్ రైలు మార్గంలో బేతంపూడి గ్రామం వద్ద గతంలో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా నాలుగు చోట్ల ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు.

30 ఏళ్ల నుంచి అవస్థలు...

కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే సాధారణ రైలు మార్గంలో బేతంపూడి గ్రామం వద్ద సుమారు 30 ఏళ్ల క్రితం అండర్ బ్రిడ్జి నిర్మించారు. ఈ అండర్ బ్రిడ్జి వద్ద వర్షాకాలంలో చుట్టుపక్కల పొలాల్లోని వరద నీరంతా వచ్చి అండర్ బ్రిడ్జి కింద చేరుతోంది. దీంతో వంతెన కింద రోడ్డు మార్గం అధ్వానంగా మారుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రైలు మార్గం కింద నిర్మించిన అండర్ బ్రిడ్జితో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నామని ఈ ప్రాంత ప్రజలు వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు తీవ్ర ఇబ్బందులు...

సర్వారం నుంచి కోయగూడెంతో పాటు సర్వారం, నరసింహాసాగర్ గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జిల వద్ద రైతులతో పాటు, వాహనదారులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సర్వారం వద్ద అండర్ బ్రిడ్జి వద్ద పనులు అసంపూర్తిగా మిగిలాయి. వర్షానికి ఈ ప్రాంతంలో మూడు అడుగుల లోతు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రైలు కట్టకు మరోవైపు సర్వారం గ్రామానికి చెందిన సుమారు 200 మంది రైతులకు వ్యవసాయ భూములు ఉన్నాయి. అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలవడంతో వ్యవసాయ పనుల నిమిత్తం.. ఎరువులు, ఇతర సామగ్రి తీసుకెళ్లాలన్నా, ట్రాక్టర్లు వెళ్లాలన్నా పంట ఉత్పత్తులు ఇళ్లకు చేర్చాలన్నా అవస్థలు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అండర్ బ్రిడ్జిల కింద రోజుల తరబడి నీరు నిలవడంతో ఉప్పరిగూడెం, కోయగూడెం, జోగయ్యగుంపు, బేతంపూడి, జామ్లా తండా తదితర గ్రామాలకు చెందిన ప్రజలు మరో మార్గాన రావాల్సి వస్తోంది. దీంతో జిల్లా కేంద్రం కొత్తగూడెం వెళ్లే ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఆయా కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అసంపూర్తిగా నిర్మాణ పనులు..

సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య అండర్ బ్రిడ్జి పనులు అసంపూర్తిగా మిగిలాయి. కాంక్రీట్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. వరద ప్రవాహానికి కొట్టుకొచ్చిన ఒండ్రు మట్టి వంతెన కింద చేరి ఈ ప్రాంతమంతా బురదమయంగా మారింది. దీంతో ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.



లక్ష్మీదేవిపల్లి వద్ద బురదమయంగా..

అవస్థలు పడుతున్నాం..



సర్వారం నుంచి నరసింహాసాగర్, సర్వారం నుంచి కోయగూడెం గ్రామాల మధ్యనున్న రెండు అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిల్వ ఉంటోంది. వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలైన సంఘటనలు ఉన్నాయి.

– గుగులోత్ మనోజ్‌కుమార్, నరసింహాసాగర్

ఎవరూ పట్టించుకోవడం లేదు



బేతంపూడి అండర్ బ్రిడ్జి వద్ద ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి రహదారి అధ్వానంగా మారింది. సమస్యను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మాకు ఇబ్బందులు తప్పడం లేదు.

– అజ్మీరా లక్ష్మి, ఉప సర్పంచ్, జామ్లా తండా

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

సుజాతనగర్: తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త అంజనాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నోటు పుస్తకాలకు సాయం అందించిన ఎన్ఆర్ఐ అన్నె శ్రీకాంత్‌ను అభినందించారు. ప్రతి ఏడాది ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో ఇటువంటి కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ బాగం కృష్ణ, అసోసియేషన్ సభ్యులు సురేష్ కుమార్, పాండురంగారావు, సామ్యూల్, విజయమోహన్, మైనేని నాగేశ్వరరావు, సోందుబాబు, గురుమూర్తి, కొండా రాములు, రాజేంద్రప్రసాద్, ధర్మారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విస్మరించిన పాలకులు



మాట్లాడుతున్న కాసాని ఐలయ్య

జూలూరుపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య అన్నారు. గురువారం గుండెపుడి గ్రామంలో జరిగిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పి యువతకు ఉపాధి లేకుండా చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత, బీసీ, మైనార్టీ, గృహలక్ష్మి పథకాల్లో రాజకీయ జోక్యం లేకుండా అర్హులను గుర్తించి ఇవ్వాలన్నారు. సమావేశంలో వల్లమల్ల చందర్‌రావు, ఆనగంటి సత్యనారాయణ, ఇల్లంగి సీతారాములు, బానోత్ మధు, దానయ్య, లక్ష్మా, ఇస్లావత్ భద్రు, రాములు, సక్రు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్

కొత్తగూడెంరూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సంతోష్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. ఉచితాలకు ఆకర్షితులు కావొద్దన్నారు. ఈ మెయిల్ లేదా మెసేజ్‌లో ప్రకటనలు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. కస్టమర్ కేర్ నంబర్‌ను గూగుల్‌లో వెతకవద్దని, మీకు లాటరీలు వచ్చిందని, లోన్స్ ఇస్తామని, తక్కువ ధరలకే ఆన్‌లైన్‌లో వస్తువులు వస్తాయని అనేక రకాలుగా మోసాలు జరుగుతున్నట్లు చెప్పారు. సైబర్ నేరానికి గురైతే బాధితులు 1930 లేదా, స్థానిక పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులపై అనుమానం కలిగితే వెంటనే పోలీసువారి డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలను అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో బ్లూకోర్ట్ కానిస్టేబుల్ బీరప్ప, ప్రవీణ్, మహిళా కానిస్టేబుల్ స్వాతి పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు..

శ్రావణమాసం తొలిరోజు గురువారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని ఆలయాలు, ఇళ్లలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. అదేవిధంగా పలు గ్రామాల్లో గ్రామదేవతలైన బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతురాజులకు జలాభిషేకం నిర్వహించి, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: రామాలయంలో ప్రత్యేక పూజలు



కొత్తగూడెంటౌన్: చండీపీఠంలో భక్తుల పూజలు



టేకులపల్లి: ముత్యాలంపాడులో బోనాల సందడి

నేడు సర్వసభ్య సమావేశం

సుజాతనగర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 17వ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు తగు నివేదికలతో సమయానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండల సర్వసభ్య సమావేశం కోరం సభ్యులు లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 మంది ఎంపీటీసీలు ఉండగా.. ఒక్కరూ కూడా హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

జనరిక్ మందులనే రాయాలి

పాల్వంచరూరల్: వైద్యులు చికిత్స సమయాన కచ్చితంగా జనరిక్ మందులనే రాయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల రమేష్ ఒక ప్రకటనలో కోరారు. ఈ విషయమై నేషనల్ మెడికల్ కమిషన్ ప్రకటన చేసినందున వైద్యులు పాటించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ప్రభుత్వం కూడా ప్రతీ మండలంలో జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయించి, ప్రజలకు అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌కు తరలిరండి

జూలూరుపాడు: ఈనెల 19న హైదరాబాద్‌లో జరగనున్న మాదిగ జర్నలిస్టు ఫోరం(ఎంజేఎఫ్) జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకుడు చాలపమడుగు నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలో మాదిగ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభకు మాదిగ జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా నామోదర్

టేకులపల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా వెంకట్యాతండాకు చెందిన ఆంగోతు నామోదర్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఈనెల 15న సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ తనకు నియామకపుపత్రం అందజేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సత్తుపల్లికి సీనియర్లను పంపడం అన్యాయం

సింగరేణి(కొత్తగూడెం): జీకేఓసీలో 35 ఏళ్లుగా పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లను సత్తుపల్లికి డిప్యూటేషన్‌పై పంపించటం సరికాదని, మాకు న్యాయం చేయాలని బీఎంఎస్ నాయకులను ఆపరేటర్లు కోరారు. గురువారం బీఎంఎస్ కార్యాలయంలో నాయకులకు వినతిపత్రం అందజేశారు. జోషఫ్, ఎం.ప్రభాకర్‌రావు, రవి, జీవీ కృష్ణారెడ్డి, ఊట్ల గణేష్, టీవీ సూరి, కాసర్ల మోహన్, గుత్తి కృష్ణ పాల్గొన్నారు.

రైతుబజార్ నిర్మాణంలో వేగం పెంచండి



పెద్దమ్మతల్లి సన్నిధిలో ఎమ్మెల్యే వనమా, నాయకులు

పాల్వంచ: పట్టణంలోని రైతు బజార్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. రూ.4.50కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అంచనా వ్యయం మరో రూ.కోటి వరకు పెరిగిందని అధికారులు చెప్పగా, నిధుల మంజూరుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో చర్చిస్తానని తెలిపారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే..

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారిని ఎమ్మెల్యే వనమా దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శివాలయం, రెండు ఫంక్షన్ హాళ్ల పనులను పరిశీలించారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ స్వామి, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడివి సరస్వతి, ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, మంతపురి రాజుగౌడ్, ఆచార్యులు, కాల్వ ప్రకాశ్, రమణమూర్తి నాయుడు, ప్రవీణ్, రాము, మధు, శ్రీను, రామారావు, గంధం వెంగళరావు, బండి చిన్నవెంకటేశ్వర్లు, ముత్యాల ప్రవీణ్, ఆడెపు చిన్నవెంకట్రామయ్య, కాటరపు లక్ష్మీనారాయణ, మల్లెల శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం నేతలు నోరు విప్పాలి



ఇన్‌చార్జ్ రక్షణ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

టేకులపల్లి: సింగరేణి కార్మికులకు 11వ వేతన బకాయిలు ఆగస్టు నెలతో పాటు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఇల్లెందు ఏరియా బ్రాంచి కార్యదర్శి ఎండీ.నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కేటీసీ పీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఇన్‌చార్జ్ రక్షణ అధికారి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. 11వ వేతన బకాయిలు చెల్లింపు కోసం కోలిండియాలో అగ్రిమెంట్ జరిగిందని, దీనికి సంబంధించిన ఉత్తర్వులు జూలై నెల చివరి వారంలో సీఐఎల్ జారీ చేసిందని, సింగరేణికి కూడా ఉత్తర్వులు వచ్చి 20 రోజులైనా వేతన బకాయి చెల్లింపు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇంత జరుగుతున్నా గుర్తింపు సంఘం నోరు మెదపడం లేదని ఆరోపించారు. కోలిండియా కార్మికులు ఆగస్టు నెల వేతనాలతో వేతన బకాయిలు తీసుకోనున్నారని తెలిపారు. పారిశ్రామిక సంబంధాలు బావుండాలంటే దీనిపై యాజమాన్యం వెంటనే ప్రకటన చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో బ్రాంచి సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోత్ కృష్ణ, పిట్ సహాయ కార్యదర్శి షేక్ సర్వర్, జీపీ శ్రీనివాస్, సామల శ్రీనివాస్, ఇస్మాయిల్, ఇబ్రహీం, భాస్కర్, విజయ్ కుమార్, సూరి, మోహన్, పవన్, రంజిత్, సాంబశివరావు, ఐలయ్య, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

ఇల్లెందు: కోల్ ఇండియాలో అమలు చేస్తున్న ఉత్తర్వులను సింగరేణిలో అమలు చేయాలని, 11వ వేతన బకాయిలు ఆగస్టు నెల వేతనంతో కలిపి అందజేయాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్ తెలిపారు. గురువారం ఇల్లెందులో సింగరేణి మైన్ల మీద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మైన్ల మీద అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచి సహాయ కార్యదర్శి గడదాసు నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొరిమి సుందర్, ఫిట్ కార్యదర్శులు సంజీవచారి, నూనె శ్రీనివాస్, భూషణం, అనిత, గాలిబ్ సాహెబ్, సహాయ కార్యదర్శులు బి.శ్రీనివాస్, కుక్కల శ్రీనివాస్, పైడిరాజు, ప్రసాద్ రెడ్డి, ధర్మయ్య, శ్రీనివాసరెడ్డి, తిరుమలరావు, దాట్ల వెంకటేశ్వర్లు, తిరుపతి, వాసం వెంకటేశ్వర్లు, బాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

అంతా హడావుడే.. అభివృద్ధే లేదు..



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కామేష్ తదితరులు

చుంచుపల్లి: కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకునేందుకే కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని హడావుడి చేస్తున్నారు తప్ప, పనులు చేయాలనే చిత్తశుద్ధి లేదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. గురువారం పార్టీ శ్రేణులతో కలిసి రుద్రంపూర్ ఏరియాలో ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. మాట్లాడుతూ... కొత్తగూడెం నియోజకవర్గంలో రూ.3000 కోట్లతో అభివృద్ధి పనులు జరిగితే ప్రజలు తాగునీటి కోసం అల్లాడే పరిస్థితి ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ విషయమై రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే చేయని హడావుడి కొత్తగూడెం ఎమ్మెల్యే చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నెలలో పదిసార్లు ఏదో ఒక సమావేశం నిర్వహించడం తనకే ఎమ్మెల్యే టికెట్ వస్తుందని, తానే పోటీలో ఉన్నానని చెప్పుకోవడం పరిపాటి అయిందన్నారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, సాయి, చెనిగారపు నిరంజన్ కుమార్, మాలోత్ వీరు నాయక్, జర్పుల కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తులపై విచారణ




సుజాతనగర్: వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ వెంకటలక్ష్మి

సుజాతనగర్: సొంత స్థలం ఉన్న పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి సుజాతనగర్ మండల వ్యాప్తంగా 2,345 దరఖాస్తులు వచ్చాయి. పేదలు చేసుకున్న దరఖాస్తులపై గురువారం నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మండల అధికారుల టీం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పర్యటించి దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల సాయంతో దరఖాస్తుల ఆధారంగా స్థానికంగా ఉంటున్నారా లేదా, రేషన్ కార్డు ఉందా లేదా అనే అంశాలతో పాటు, స్థలానికి సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నారు. ఈ నెల 20 వరకు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి తలుగు వెంకటలక్ష్మి తెలిపారు.

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామపంచాయతీలలో గృహలక్ష్మి దరఖాస్తులపై గ్రామపంచాయతీ కార్యదర్శులు గురువారం ఇంటింటి విచారణ నిర్వహించారు. దరఖాస్తులో పొందుపర్చిన అంశాలను విచారించారు. సొంత స్థలాన్ని తనిఖీ చేస్తున్నారు. పలు గ్రామాలలో విచారణ తీరును ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

నిబంధనలు సడలించండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి రామవరం ప్రాంతానికి గృహలక్ష్మి నిబంధనలు సడలించాలని కోరుతూ గురువారం సీపీఐ కౌన్సిలర్లు, నాయకులు కమిషనర్ రఘుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. గతంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఏ పద్ధతిని అనుసరించారో అదేవిధంగా రామవరం ప్రాంత ప్రజలకి రిజిస్ట్రేషన్ దస్తావేజు నిబంధన లేకుండా సొంత స్థలం ఉండి, రేకులతో నిర్మాణం చేసుకొని గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న అర్హులకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




అటెన్షన్ ప్లీజ్

చెత్త నిల్వ కేంద్రంగా శివారు ప్రాంతం

ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ లలితాపురం గ్రామ శివారు ప్రాంతాన్ని, మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ వార్డుల్లో, సింగరేణి కార్మికవాడల్లో సేకరించిన చెత్త కమ్మేస్తోంది. ఇంటింట సేకరించిన చెత్తను అనధికారికంగా ఇక్కడ డంప్ చేస్తున్నారు. చెత్తకు కార్మికులు నిప్పు పెట్టడంతో లలితాపురం గ్రామాన్ని విషవాయువులు కమ్మేస్తున్నాయి. అధికారులు తక్షణం స్పందించి చెత్త నిల్వను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– ఇల్లెందురూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : రజనీకాంత్, కార్యదర్శి, సుభాష్‌నగర్

సెల్‌నంబర్: 9966142448